క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మి జాతర



జాతరకు ముస్తాబు అయిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు

ఎస్.రాయవరం: కర్రివానిపాలెంలో శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు జాతర గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది కొత్త అమావాస్య తరువాత 9 రోజుల పాటు గ్రామంలో అమ్మవారిని ఊరేగించి, చివరి రోజున ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ జాతరకు హైదరాబాద్, విశాఖపట్నం, తదితర పట్టణాల్లో స్థిరపడిన వారంతా స్వగ్రామానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ మేరకు గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ, అమ్మవారి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు.

టాటా రీసెర్చ్‌లో పీహెచ్‌డీకి అర్హత సాధించిన లక్ష్మీ ప్రహర్ష



కొశిరెడ్డి లక్ష్మీ ప్రహర్ష

పాయకరావుపేట: టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(ముంబయి)లో గతేడాది డిసెంబరు 8న జాతీయ స్థాయిలో నిర్వహించిన పీహెచ్‌డీ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో పట్టణానికి చెందిన కొశిరెడ్డి లక్ష్మీప్రహర్ష సత్తా చాటింది. జాతీయ స్థాయిలో 150 మందిని ప్రథమ శ్రేణి ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో గత నెల 5, 6 తేదీల్లో సెకండ్ లెవెల్ ఇంటర్వ్యూలు నిర్వహించి 36 మందిని ఎంపిక చేశారు. ఇందులో లక్ష్మీ ప్రహర్షకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్‌లో పీహెచ్‌డీ సీటు దక్కిందని ఆమె తండ్రి కొశిరెడ్డి వీర్రాజు తెలిపారు. ఫిజిక్స్ విభాగంలో రీసెర్చ్ చేసి సైంటిస్ట్‌గా స్థిరపడాలనేదే తన ఆకాంక్ష అని లక్ష్మీప్రహర్ష చెప్పారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం



ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు

అచ్యుతాపురం: మండలంలోని ఎం.జగన్నాథపురంలో త్రైత సిద్ధాంతంపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం ప్రచార రథంతో అవగాహన కల్పించారు. త్రైత సిద్ధాంతంపై ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో శాంతరాజు, సోమునాయుడు, నాగేశ్వరరావు, శ్రీను, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న స్కూటీ, నాటు సారా

పాయకరావుపేట: మండలంలోని మంగవరం, గుంటపల్లి గ్రామాల్లో పోలీసులు దాడులు చేసి, ఇద్దరి నుంచి 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. గుంటపల్లి, మంగవరం రోడ్డులో స్కూటీపై నాటు సారా తరలిస్తుండగా పోలీసులు గమనించారు. సారాను, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఓ వ్యక్తి పరారయ్యాడు. ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, యలమంచిలి కోర్టుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ సర్టిఫికెట్ల ప్రదానం



స్కౌట్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ

పాయకరావుపేట: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శిక్షణ సర్టిఫికెట్లను ప్రధానోపాధ్యాయుడు ఎం.సత్యనారాయణ బుధవారం ప్రదానం చేశారు. స్కౌట్ మాస్టర్ ఆర్.రమేష్, గైడ్ కెప్టెన్ కె.రత్నాలమ్మ 44 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

మునగపాకలో వర్షం



మునగపాకలో కురుస్తున్న వర్షం

మునగపాక: మండల వ్యాప్తంగా బుధవారం వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. కొద్ది రోజులుగా సాయంత్రం అయితే చాలు ఆకాశంలో మేఘాలు కమ్ముకుని ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి తెలిపారు.

నిబంధనలు తుక్కు



యలమంచిలి కోర్టు కూడలి వద్ద దేవదాయ శాఖ స్థలంలో నివాస గృహాలకు సమీపంలో ఏర్పాటు చేసిన స్క్రాప్ దుకాణం

ఇళ్ల మధ్య స్క్రాప్ దుకాణాలు భద్రమేనా?

పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా పట్టించుకోని అధికారులు

అగ్ని ప్రమాదాలకు ఆహ్వానం.. ప్రజలకు తప్పని ఇబ్బందులు

యలమంచిలి రూరల్: నియోజకవర్గంలో తుక్కు దుకాణాల నిర్వహణ తీరు ఆందోళన కలిగిస్తోంది. జనావాసాల్లో అడ్డగోలుగా ఏర్పాటు చేయడం.. అధికారుల అలక్ష్యాన్ని ప్రశ్నిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా స్క్రాప్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. లక్షలాది రూపాయల టర్నోవర్‌తో కొనసాగుతున్న తుక్కు(స్క్రాప్) దుకాణాల నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను కాల్చుతూ వాయు కాలుష్యానికి కారణమవుతున్నా, భారీ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు



కాకివాని వీధిలో ఇళ్ల మధ్య స్క్రాప్ దుకాణం



పట్టణంలోని గాజువాక బైపాస్ రోడ్డులో స్క్రాప్ షాపునకు ఆనుకుని ఉన్న భారీ గోదాము

వినిపిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రం యలమంచిలి పట్టణంతో పాటు మండలంలో పలు చోట్ల నిబంధనలు పాటించకుండా విచ్చలవిడిగా తుక్కు దుకాణాలు నిర్వహిస్తున్నారు. 10 ఏళ్ల క్రితం పదిలోపు ఉండే తుక్కు దుకాణాలు యలమంచిలి మున్సిపాలిటీ, మండల పరిధిలో పదుల సంఖ్యలో ఏర్పాటయ్యాయి. ముఖ్యంగా జనావాసాలు, ప్రధాన రహదారుల వెంబడి ఈ దుకాణాలు ఏర్పాటు చేయకూడదు. పెట్రోల్ బంకులు సమీపంలో తుక్కు దుకాణాలు నిర్వహించడం ప్రమాదకరం. అయినా యలమంచిలి పట్టణంలో ఈ నిబంధనలేవీ పాటించకుండా మున్సిపాలిటీ నుంచి కేవలం ఒక ట్రేడ్ లైసెన్స్ మాత్రమే తీసుకుని వీటిని ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. చిరు వ్యాపారులు సేకరించిన ఇనుము, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను బడా వ్యాపారులు గొడౌన్లలో నిల్వ చేస్తున్నారు. నిల్వ చేసిన వ్యర్థాలను లారీలు, వ్యాన్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇలా రవాణా చేసే వాటికి నిబంధనల ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ తుక్కు వ్యాపారులు పన్ను చెల్లింపును ఎగ్గొడుతున్నారు. అయినా అధికారులెవరూ తనిఖీ చేసిన దాఖలాలు లేవు. తుక్కు దుకాణాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే సమీపంలో నివాస గృహాలకు ఇబ్బందులు తప్పవు.

దోమలు, పాములకు నిలయంగా..

నివాస గృహాల మధ్య కొనసాగుతున్న తుక్కు దుకాణాల వల్ల సమీపంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాత ప్లాస్టిక్ డబ్బాలు, అట్టలు, తుప్పు పట్టిన ఇనుప వస్తువుల్లో వర్షపు నీరు చేరి దోమలకు నిలయంగా మారుతున్నాయి. దుకాణాల్లో పేరుకుపోయిన పాత సామానుల్లో పాములు, విషపు పురుగులు స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. అవి పక్కనున్న ఇళ్లలోకి చొరబడుతుండడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. తుప్పు పట్టిన మేకులు, ఇనుప ముక్కలు వాహనాల టైర్లకు గుచ్చుకుని పంక్చర్లు అవుతున్నాయని వాహన చోదకులు చెబుతున్నారు. దీనికితోడు ఇనుప సామానును తుక్కుగా మార్చే క్రమంలో పెద్ద శబ్దాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారుల వెంబడి ఏర్పాటైన తుక్కు దుకాణాలు, గొడౌన్ల కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

పెరుగుతున్న వాయు కాలుష్యం

తుక్కు దుకాణాల నిర్వాహకులు కొనుగోలు చేసిన వివిధ రకాల టైర్లు, డ్రమ్ములు, విద్యుత్ వైర్లు అక్కడే కాల్చుతున్నారు. దీంతో దట్టమైన పొగతో కూడిన మంటలు పెద్దఎత్తున ఎగసిపడుతున్నాయి. దీనివల్ల వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని, పొగ వెళ్లే వరకు ఇంటి తలుపులను మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంటోందని ప్రజలు చెబుతున్నారు. అంతేకాకుండా వాయు కాలుష్యం పెరిగి అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన వాహనాలను సైతం ఇళ్ల మధ్య ఉన్న తుక్కు దుకాణాల్లోనే తుక్కుగా మార్చుతున్నారు. తొలుత జీవనోపాధికి ఏర్పాటు చేస్తున్న తుక్కు దుకాణాలు క్రమేపీ వ్యాపార సామ్రాజ్యంగా విస్తరిస్తున్నాయి. అధికారులు స్పందించి నివాస గృహాలకు సమీపంలో ఉన్న తుక్కు దుకాణాలు, గోదాములను దూరంగా జనసంచారం లేని ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

8 స్క్రాప్ దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు



పట్టణంలో 8 స్క్రాప్ దుకాణాలకు మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్సులు ఇచ్చాం. వాటి నిర్వహణకు సంబంధించి ఎలాంటి నిబంధనలు పెట్టలేదు. పట్టణ పరిధిలో స్క్రాప్ దుకాణాల నిర్వహణ తీరుపై దృష్టి పెడతాం. అవసరమైతే వాటిని పరిశీలిస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. నివాస గృహాల సమీపంలో స్క్రాప్ దుకాణాల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత వ్యాపారులదే. ఆయా ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తీవ్రంగా పరిగణిస్తాం. స్క్రాప్ దుకాణాల వద్ద అగ్ని నిరోధక పరికరాలు అందుబాటులో ఉండాలి.

– బీజేఎస్ ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్, యలమంచిలి

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మూలపేటలో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మండలంలోని మూలపేటలో బుధవారం ఆయన ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా వలసలు నివారించవచ్చన్నారు. పనిచేసే కూలీలకు సకాలంలో వేతనాలు అందుతాయన్నారు. అంతేకాకుండా ఈ పథకం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఏపీఎం శివ, కూటమి నేతలు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి



ఎంపీడీవో ఉషారాణికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు

మునగపాక: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో ఎం.ఉషారాణికి ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు తగిన గుర్తింపు ఉండడం లేదని, ఏ స్థాయిలోనూ తమను ఉద్యోగులకు పరిగణించకపోవడం బాధాకరమని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులు ఇచ్చిన లక్ష్యాలను కష్టపడి చేరుకుంటున్నా ఫలితం కనిపించడం లేదన్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

కైలాసపట్నం క్షతగాత్రులకు పరామర్శ



మెడికవర్‌లో గోవిందును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, ఉమాదేవి

కోటవురట్ల: కైలాసపట్నంలో జరిగిన బాణసంచా ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్దాబత్తుల సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. కేజీహెచ్, మెడికవర్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలిసి వారికి మనోధైర్యాన్ని కల్పించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అనంతరం మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రభుత్వం ఇస్తున్న ఎక్స్‌గ్రేషియాను పెంచాలని కోరుతూ జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదన్నారు. గత ప్రభుత్వంలో ఇటువంటి ప్రమాద సంఘటనలు చోటుచేసుకున్నపుడు బాధిత కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అందులో నాలుగో వంతు కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు. క్షతగాత్రులకు రూ.లక్ష ఎందుకు ఉపయోగపడతాయని ప్రశ్నించారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు పరిహారం పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రమాద ఘటనలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. బాణసంచా కేంద్రాలపై పర్యవేక్షణ లేకుండా అడ్డగోలుగా అనుమతులు మంజూరు చేయడం వల్లనే తరచూ ప్రమాదాల చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి చేసి చేతులు దులిపేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ అంశాలను వినతిపత్రంలో పొందుపరిచినట్టు తెలిపారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఇద్దరిపై కేసులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని రహదారులపై రయ్ రయ్‌మంటూ హల్‌చల్ చేస్తున్న యువకులపై రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్టు బుధవారం రాత్రి పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు. పట్టణంలో ఇటీవల ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకుల సంఖ్య పెరిగిపోతోంది. మంగళవారం ఇద్దరు గుర్తు తెలియని యువకులు తులసీనగర్‌లో ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళ మెడలో బంగారు పుస్తెలతాడు బలవంతంగా తెంపుకొని స్కూటీపై పరారయ్యారు. ఈ నేపథ్యంలో పట్టణంలో ర్యాష్ డ్రైవింగ్‌తో పాటు రహదారి నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసులు నిర్ణయించారు. బుధవారం ఇద్దరు యువకులపై కేసులు నమోదు చేసిన పట్టణ పోలీసులు రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ర్యాష్ డ్రైవింగ్ కారణంగా పాదచారులు కూడా భయభ్రాంతులకు గురవుతున్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు



అంగన్‌వాడీ కేంద్రం పక్కనే చేపట్టిన నిర్మాణం

కోటవురట్ల: అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాలపై కన్నేసి దర్జాగా ఆక్రమించుకుంటున్నారు. ఏమాత్రం జంకు లేకుండా నిర్మాణాలు ప్రారంభించేస్తున్నారు. పి.కె.పల్లిలోని బీసీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం-3 భవనం కోసం రెవెన్యూ అధికారులు గతంలో ఐదున్నర సెంట్లు ప్రభుత్వ భూమిని కేటాయించారు. భవన నిర్మాణం చివరి దశకు చేరుకోగా.. అంగన్‌వాడీకి కేటాయించిన భవనం పక్క స్థలాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీనిపై గ్రామ సర్పంచ్ యలగాడ బెన్నమ్మ అభ్యంతరం వ్యక్తం చేసి నిర్మాణాన్ని ఆపాలని కోరారు. కాగా సదరు వ్యక్తి తనకు అధికారులు ఎల్‌పీసీ ఇచ్చారని చెబుతూ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడు. దాంతో సర్పంచ్ బెన్నమ్మ, గ్రామస్తులు బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు తిరుమలరావు, పోలీసులు, ఎంపీడీవో కార్యాలయంలోను ఫిర్యాదు అందజేసి అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని, అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జెడ్పీటీసీ లాలం రాము, కో–ఆప్షన్ సభ్యుడు కుమార్

అచ్యుతాపురం రూరల్ : ప్రత్యేక ఆర్థిక మండలి అచ్యుతాపురంలో పలు సమస్యల పరిష్కారం కోసం అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు జెడ్పీటీసీ లాలం రాము, కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ బుధవార వినతి పత్రం అందజేశారు. బుధవారం జిల్లా పరిషత్‌లో జరిగిన సమావేశంలో వారు కలెక్టర్‌ను కలిశారు. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకూ రోడ్డు బాధితులకు టీడీఆర్ బాండ్లకు బదులు నగదు పరిహారం ఇవ్వాలన్నారు. అచ్యుతాపురంలో తమ గోడు వినిపించుకోవడానికి ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి తహసీల్దార్‌కు బదులు రెగ్యులర్ తహసీల్దార్ నియామకం చేపట్టాలన్నారు. రావిపాలెం, దోడూరు, దొప్పెర్ల డీ–పట్టా భూములు కోల్పోయిన రైతులకు రూ.60 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. భూమి కోల్పోయిన ప్రతి రైతుకు 5 సెంట్లు భూమి ఇచ్చి, ఇనాం భూములకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలన్నారు. ఆవ సోమవరం నుంచి తమ్మాయపేట వరకూ, గండివానిపాలెం నుంచి కొల్లివానిపాలెం వరకూ రోడ్ల అభివృద్ధికి బిల్లులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించాలని కోరారు. స్వీపర్లకు ప్రతి నెలా జీతం ఇవ్వాలని వినతిపత్రంలో కోరామన్నారు.

రథోత్సవంలో గాయపడ్డ బేరర్‌కు సాయం



బాధితుడికి సాయం అందిస్తున్న ప్రధానార్చకుడు వరప్రసాద్

నక్కపల్లి : గత నెల ఉపమాక వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో గాయపడిన వాహన బేరర్ పొన్నాడ ప్రభాకరాచారికి దేవస్థానం ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు రూ.15 వేలు సాయం అందజేశారు. గత నెల 10న రథోత్సవాన్ని పురస్కరించుకుని రాత్రి నిర్వహించిన తిరువీధి సేవలో వాహన బేరర్‌గా పని చేస్తున్న ప్రభాకర్ ఆచారి కాలు, మడమ భాగం రథ చక్రాల కింద పడి నలిగిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆయన పరిస్థితిని చూసి ప్రధానార్చకుడు బుధవారం రూ.15 వేలు నగదు సాయాన్ని అందించారు.

సమస్యలపై ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన



మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ఎస్.రాయవరం: దశాబ్ద కాలంగా గ్రామాల్లో లక్ష్యానికి మించి పనులు చేస్తున్నా తమను ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించడం లేదని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. సుమారు 10 ఏళ్లుగా గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్నామని, కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలు గడుస్తున్నా తమ సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణకి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ ఉద్యోగిగా గుర్తించాలని, మండల యూనిట్‌గా తీసుకుని అంతర్గత బదిలీలు చేయడం వల్ల స్థానిక ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు తగ్గుతాయన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల విద్యార్హతలను బట్టి పదోన్నతి కల్పించాలన్నారు. ఈ నిరసనలో ఫీల్డ్ అసిస్టెంట్లు వీరబాబు, వి.అప్పారావు, టి.రమేష్, కె.రాజేశ్వరి, బి.లోవతల్లి, కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామరక్షా రథానికి ఘనంగా స్వాగతం పలకాలి



రామన్నపాలెంలో ఎంపీటీసీ లాలం శ్రీనును ఆహ్వానిస్తున్న సమితి కార్యదర్శి కొల్లి అప్పారావు

అచ్యుతాపురం రూరల్ : అయోధ్య శ్రీరామరక్షా రథయాత్రను గ్రామాల్లో ఘనంగా స్వాగతించాలని ధర్మ రక్షా సమితి కార్యదర్శి కొల్లి అప్పారావు కోరారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలో తంతడి, రాజన్నపాలెం, గండివానిపాలెం, దోసూరు, మడుతూరు, అప్పన్నపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో పెద్దలను, ఆయా గ్రామ సర్పంచ్‌లను కలిసి కమిటీ వేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ మండల మేనేజర్ పడాల గురునాథరావు, సూపర్‌వైజర్ కన్నూరు వరహామూర్తి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మునగపాకలో ఘర్షణ

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో బుధవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న మునగపాక పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపునకు బుధవారం రాత్రి లారీ వెళ్తుంది. అదే సమయంలో అక్కడే ఉన్న పంచాయతీ ఆశీలు వసూలు చేసే వ్యక్తి లారీ డ్రైవర్‌ను ఆశీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లారీ డ్రైవర్ వినిపించుకోకుండా రోడ్డు పక్కనే ఉన్న వైన్‌షాపు వద్దకు వెళ్లి మద్యం కొనుగోలు తాగుతున్నాడు. డ్రైవర్‌ను ఆశీలు చెల్లించాలంటూ మళ్లీ ఆయన డిమాండ్ చేశారు. దీంతో మాటామాట పెరగడంతో వివాదం ముదిరిపోయింది. ఒకరిపై ఒకరు కేకలు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు రంగ ప్రవేశం చేసి వివాదాన్ని సద్దుమణిగేలా చర్యలు తీసుకున్నారు.

గ్యాస్ లీకేజీలతో ఆందోళన చెందొద్దు



మంటలను ఎలా ఆర్పివేయాలో మహిళలకు వివరిస్తున్న అగ్నిమాపక అధికారి రాంబాబు

యలమంచిలి రూరల్: ఇంట్లోని వంట గ్యాస్ లీకేజీలతో ఆందోళన చెందవద్దని యలమంచిలి ఫైర్ ఆఫీసర్ డి.రాంబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా యలమంచిలి పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్లలో మహిళలకు అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. గ్యాస్ లీకై మంటలు వస్తే గోనె సంచి లేదా తడి గుడ్డను సిలిండర్ చుట్టూ చుడితే మంటలు వ్యాప్తి ఆగిపోతుందన్నారు. ఇంట్లో సిలిండర్ ఉన్న చోట వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. అప్పుడప్పుడు గ్యాస్ పైపును పరిశీలించాలని సూచించారు. వేసవిలో ప్రజలు అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు.

తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యతా లోపం?



ఇటీవల వమ్మవరం గ్రామానికి నిర్మించిన తారురోడ్డు

ఎస్.రాయవరం: వమ్మవరం గ్రామానికి రూ.1.40 కోట్లతో నిర్మించిన తారు రోడ్డు ప్రారంభం కాకుండానే పగుళ్లు రావడంతో వాహన చోదకులు విమర్శలు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన ఈ రోడ్డును గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పూర్తి చేసింది. పెనుగొల్లు నుంచి వమ్మవరం వరకు వారం రోజుల క్రితం తారు రోడ్డు వేశారు. పలు చోట్ల నాణ్యత లోపం కారణంగా అప్పుడే రోడ్డు పాడైపోయింది. వాహనాలు పూర్తి స్థాయిలో రాకపోకలు సాగక ముందే ఇలా ఉంటే.. భవిష్యత్తులో మరింత అధ్వానంగా తయారయ్యే అవకాశం ఉందని వాహనచోదకులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించి సరి చేయాలని కోరుతున్నారు.